

దొంగతనానికి వచ్చి చిక్కాడు

తాళం వేసిన ఇంట్లో దొంగతనానికి వచ్చిన వ్యక్తిని యజమాని పట్టుకొని పోలీసులకు అప్పగించాడు.

వివరాలు 10లో ▸



నిరీక్షణ ఇంకా ఎన్నాళ్లు?

రెండేళ్లుగా నూతన పింఛన్‌లను మంజూరు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కొత్త పింఛన్లు వస్తాయనే ఆశతో ఉన్న లబ్ధిదారులకు నిరాశ తప్పడం లేదు. వివరాలు 11లో ▸



డ్రగ్స్‌పై అవగాహన

పట్టణంలోని ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ టీం సభ్యులు విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హత్నూర(సంగారెడ్డి): హత్నూరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో పార్ట్ టైమ్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. కళాశాలలో బోటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులను బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు సోమవారం ఇంటర్వ్యూలకు హాజరు కావొచ్చని ప్రిన్సిపాల్ మధుసూదన్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. బోటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్‌తోపాటు బీఈడీ చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు.

విద్యతోనే మంచి భవిష్యత్



గిరిజన విద్యార్థులను సన్మానిస్తున్న టీబీస్ తులసీరాం రాథోడ్

జహీరాబాద్ టౌన్: విద్యతోనే మంచి భవిష్యత్ లభిస్తుందని తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవా సంఘం (టీబెస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్ పేర్కొన్నారు. జహీరాబాద్ మండలంలోని పలు తండాలకు చెందిన గిరిజన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన సందర్భంగా టీబెస్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మారు మూల తండాలలోని గిరిజన విద్యార్థులు చదువులో రాణించడం అభినందనీయమన్నారు. టీబెస్ నాయకులు అర్జున్ చవాన్, తుకరాం చవాన్, దేవిసింగ్‌రాథోడ్, హన్మంత్‌పవార్, రమేశ్ బానోత్, హీరాలాల్, సుభాష్, జైసింగ్ రాథోడ్, నాణుసింగ్, డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతోనే శారీరక దారుఢ్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: క్రీడలతోనే శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ మండే మార్కెట్‌లో పండు టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీజన్ 8వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. గత ఎనిమిదేళ్లుగా అమీన్‌పూర్ వేదికగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. స్వతహాగా క్రీడలంటే తనకు ఇష్టమని, కబడ్డీ అంటే అమిత ఆసక్తి తెలిపారు. నియోజకవర్గ పరిధిలో క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని చెప్పారు. కబడ్డీ పోటీలకు రూ.2 లక్షల సొంత నిధులను అందజేశారు. భవిష్యత్తులోనూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీనిచ్చారు. రెండు రోజులపాటు జరగనున్న పోటీలలో 60 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ ఎంపీపీ దేవానంద్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు శ్రీనివాస్ రెడ్డి, కబడ్డీ సంఘం ప్రతినిధి ఎల్లయ్య, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ప్రసంగం వీక్షణ

మునిపల్లి(అందోల్): మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం నిర్వహించిన రైతుపండుగ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని మునిపల్లి పరిసర ప్రాంత రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. మునిపల్లిలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ పోటీలో మునిపల్లి విద్యార్థి



అస్లాంను అభినందిస్తున్న అధ్యాపకులు

మునిపల్లి(అందోల్): మునిపల్లి మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి అస్లాం రాష్ట్రస్థాయి రైఫిల్ పోటీలో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లిక శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఈ నెల 29, 30వ తేదీలో జరిగాయి. మూడు విభాగాల్లో (ఓపెన్ సైట్, పీస్‌సైట్, పిస్టల్) జరిగాయి. మునిపల్లి మండలం పెద్దచల్మెడ గ్రామానికి చెందిన అస్లాం, రాష్ట్రస్థాయి ఓపెన్ సైట్, 10 మీటర్ల విభాగంలో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లిక, ఫిజికల్ డైరెక్టర్ మన్సూర్ అహ్మద్ విద్యార్థి అస్లాంను అభినందించారు.



గ్రీన్ ఫీల్డ్ ఫార్మా విలేజ్ కోసం సేకరిస్తున్న భూములివే

తలొగ్గేనా.. తలదన్నేనా..!

అభివృద్ధి పేరిట రేవంత్ సర్కార్ ఓ వైపు రైతుల భూములు గుంజుకుంటూ ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేయాలని చూస్తోంటే మరోవైపు తమ బతుకుదెరువైన భూములను లాక్కోవద్దంటూ రైతుల ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఆందోళనలతో రేవంత్ సర్కార్ మొన్న కొడంగల్‌లో ఫార్మా విలేజ్, నిన్న దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీల ఏర్పాటుపై దిగివచ్చింది. తాజాగా డపూర్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్ ఏర్పాటును నిరసిస్తూ పచ్చని పల్లెల్లో ఫార్మా చిచ్చుపెట్టొద్దంటూ రైతులు ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనకు తలొగ్గి ఫార్మా విలేజ్ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంటుందా లేదా వారి ఆందోళనల్ని లెక్కచేయకుండా ముందుకెళ్తుందా? ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

- డపూర్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్ ఏర్పాటుపై రైతుల ఆందోళనలు
- సర్కారు నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి
- రైతు ఆందోళనలతో ఫార్మా విలేజ్, ఇథనాల్ ఫ్యాక్టరీపై సర్కార్ వెనక్కి..
- ఫార్మా కంపెనీలు మాకొద్దు అంటున్న బాధిత గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : డపూర్ గ్రీన్ ఫీల్డ్ ఫార్మా విలేజ్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందనే అంశం ఇప్పుడు తెరపైకి వచ్చింది. లగచర్ల బాధితుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కొడంగల్ ఫార్మా విలేజ్ ఏర్పాటును రద్దు చేసింది. అలాగే దిలావర్‌పూర్ ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు రద్దు చేసింది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డపూర్, వడ్డి, మాల్గి గ్రామాల్లో ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. ఈ నిర్ణయంపై ఈ మూడు గ్రామాల వాసులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. పచ్చని పల్లెల్లో ఫార్మా చిచ్చు పెట్టొద్దంటూ దశలవారీగా ఉద్యమం చేస్తున్నారు. తమ భూములు బలవంతంగా లాక్కుంటే ఊరుకునేది లేదని అదనపు కలెక్టర్‌ను అడ్డుకున్నారు. గ్రామానికి వెళ్లిన ఇతర అధికారులను పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి నిరసన తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఈ ఫార్మా విలేజ్ విషయంలో కూడా ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోవాలని బాధిత గ్రామాల వాసులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మాత్రం భూసేకరణపై ముందుకెళతామని తేల్చి చెబుతున్నారు.

కొనసాగుతున్న ఎంజాయ్‌మెంట్ సర్వే..

ఈ ఫార్మా విలేజ్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియ చేపట్టిన విషయం విదితమే. నాలుగు నెలల క్రితమే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. డపూర్, వడ్డి, మాల్గి గ్రామాల పరిధిలో మొత్తం రెండు వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించి ఫార్మా కంపెనీలకు కేటాయించాలని భావిస్తోంది. ఈ భూసేకరణకు సంబంధించి ఇప్పటికే 1,921 ఎకరాల భూమి సేకరణ కోసం ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదలైంది. ప్రస్తుతం ఈ మూడు గ్రామాల పరిధిలో ఈ భూముల ఎంజాయ్‌మెంట్ సర్వే కొనసాగుతోంది. భూసేకరణ చేయనున్న భూముల్లోని ప్రభుత్వ భూముల సర్వే కూడా పూర్తయింది. రైతుల భూములు సర్వే చేయనున్నారు. సర్వే పూర్తయితే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తా రు. తర్వాత భూములు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లింపు, పునరావాసం వంటి ప్రక్రియ ఉంటుంది.



డపూర్ గ్రామం, సంగారెడ్డి జిల్లా

మంజీరాకు ముప్పు..?

ఈ ప్రాంతంలో ఫార్మా కంపెనీలు ఏర్పడితే మంజీరా నదికి కూడా ముప్పు ఉంటుందని బాధిత గ్రామాల వాసులు వాపోతున్నారు. ప్రతిపాదిక ఫార్మా విలేజ్ ఏర్పాటుకు కొద్దిదూరం నుంచే మంజీర నది ప్రవహిస్తూ ఉంటుంది. ఒకవేళ ఫార్మా వ్యర్థాలు వదిలితే స్థానిక చెరువులు, కాలువలు కలుషితమై...పక్కనే ఉన్న మంజీరా నది కాలుష్యం బారిన పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

భూసేకరణ కొనసాగుతోంది..

డపూర్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం రాలేదు. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చాము. ఈ ప్రక్రియను కొనసాగిస్తాం.

– రాంరెడ్డి, ఫార్మా విలేజ్ భూసేకరణ అధికారి, జహీరాబాద్ ఆర్డీవో

మాది కూడా రద్దయితే బాగుండే..



మాకు ఐదు ఎకరాలకుపైగా భూమి ఉంది. మా కుటుంబం అంతా బతుకుడే ఈ భూమి తోటి. కంపెన్ల కోసం మా భూములు గుంజుకుంటామంటే ఊరుకునేది లేదు. లగచర్ల ఫార్మా విలేజ్ రద్దయిందని అంటున్నారు. మా దగ్గర కూడా పెడుతామంటున్న ఫార్మా విలేజ్ ఏర్పాటును కూడా ప్రభుత్వ ఉపసంహరించుకోవాలి.

– ఎ.ఎల్లారెడ్డి, బాధితరైతు, దపూరు, సంగారెడ్డి జిల్లా.

ఫార్మా కంపెనీలు మాకొద్దు...



ప్రాణం పోయినా మా భూములు ఇచ్చేది లేదు. మా గ్రామంలో ఫార్మా కంపెనీలు పెడుతామంటున్నారు. మాకు కంపెనీలు వద్దూ ఏమీ వద్దు. నాకున్న రెండున్నర ఎకరాల్లో పంటలు పండించుకుని బతుకుతున్నాం. లగుచర్ల మాదిరిగానే మా విషయంలోనూ ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోవాలి.

– డి.సంగమేశ్వర్, దపూర్ వాసి, సంగారెడ్డి జిల్లా



చెక్కును అందిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు

మహిళల్ని కోటీశ్వరుల్ని చేస్తాం

ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామీణప్రాంతాల మహిళల్ని కోటీశ్వరులను చేయటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పేర్కొన్నారు. ఝరాసంగంలో శనివారం మహిళా సంఘం ద్వారా కొత్తగా ఏర్పాటు చేసిన స్ఫూర్తి మహిళా శక్తి క్యాంటిన్‌ను ఆయన ఎమ్మెల్యే మాణిక్ రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, సీనియర్ నాయకుడు ఉజ్వల్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. అదేవిధంగా బ్యాంక్ లింకేజ్ ద్వారా మంజూరయిన రూ.24,14,10,000ల చెక్కును సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో లో మాజీ ఎంపీపీ దేవదాసు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రుద్రప్పపాటిల్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు శంకర్‌పాటి ల్, నాయకులు, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాధాకిషన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు సమాచారం కోసం 89858 89663, 78933 08762 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మెరుగైన సేవలతోనే గుర్తింపు

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- మూడు దశల్లో సీఎం కప్ క్రీడా పోటీలు
- కెనరా బ్యాంకు 18వ శాఖను ప్రారంభించిన కలెక్టర్

సంగారెడ్డి జోన్: ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తేనే అధికారులకు గుర్తింపు వస్తుందని కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు డిసెంబర్ 7 నుంచి మూడు దశలలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కలెక్టరేట్లో సీఎం కప్ క్రీడా పోటీలపై మండల ప్రత్యేకాధికారులు, వివిధ స్పోర్ట్స్ కమిటీలతో శనివారం సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...డిసెంబర్ 7, 8 తేదీలలో గ్రామస్థాయిలో సీఎం కప్ పోటీలు, డిసెంబర్ 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16వ తేదీ నుంచి 21 వరకు జిల్లాస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో క్రీడా పోటీలకు అవసరమైన ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో పద్మజ రాణి, జిల్లా యువజన, క్రీడా శాఖాధికారి ఎం.ఖాసీం బేగ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎంసీహెచ్‌ఆర్‌డీ ద్వారా జిల్లాకు వచ్చిన 30 మంది శిక్షణ సివిల్ సర్వీసెస్ అధికారుల పర్యటన ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సివిల్ సర్వీసెస్ అధికారులు క్షేత్రస్థాయిలో జరిగే ప్రతీ విషయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం సివిల్ సర్వీసెస్ అధికారులకు దక్కుతుందని దీన్ని సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.



సివిల్స్ ట్రైనీ అధికారులతో కలెక్టర్ క్రాంతి

వినియోగదారులకు మెరుగైన సేవలు

బ్యాంకుకు వచ్చే వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి సూచించారు. సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి బైపాస్ వద్ద కెనరా బ్యాంకు తన 18వ శాఖను బ్యాంకు ప్రారంభించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ బి.శ్రీనివాస్, జిల్లాలీడ్ బ్యాంక్ మేనేజర్ గోపాల్ రెడ్డి, బ్యాంక్ సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.



ఆచారాలకు.. పాడె కట్టారు..!

మారిన అంత్యక్రియల కల్చర్ .. పట్నం నుంచి పల్లెదాకా..


సండే స్పెషల్

- నాడు పాడె మోసేవారు.. నేడు వైకుంఠ రథాలు
- రాత్రి వేళల్లో భజనలు, ఒగ్గు కథలు మాయం
- కడచూపు కోసం గడపైనా దాటడం లేదు
- అమానవీయంగా అంత్యక్రియల తంతు

– చెక్కపల్లి రాజమల్లు

దుబ్బాకరూరల్:

మనుమల మధ్య ముడిపడిన బంధాలు రోజురోజుకూ విడివడుతున్నాయి. అది రక్తసంబంధమైనా, మూడుముళ్ల బంధమైనా..ఏ బంధమైనా సరే..! సాటిమనిషికి ఆపదంటే అందరూ ఆదుకునే ఆపద్బాంధవులే. ఆధునిక కాలంలో అధునాతన పరిజ్ఞానం ఎటువంటి బంధాన్ని అయినా బీటలు వారిస్తోంది. కాకుల ఐకమత్యం నాడు మనుమల్లో కనిపించేది.. నేడు మనిషే ఏకాకిగా మిగిలిపోతున్నాడు. మనిషి మరణిస్తే చివరిచూపు కోసం సప్తసముద్రాలు దాటైనా వచ్చేవారు. ఇప్పుడు కడసారి చూసేందుకు కనీసం గడపైనా దాటకుండానే అంత్యక్రియల తంతును వీక్షిస్తున్నాడు. బంధాలకు బీటలు వార్చి, మనుమల్లోని మానవీయతను మరుగున పడేలా చేసింది ఈ ఆధునిక సాంకేతికత. చనిపోతే పాడె కట్టేవారు, మోసేందుకు ఆ నలుగురు లేక వైకుంఠ రథాల్లోనే శ్మశాన వాటికకు తీసుకెళ్తున్నారు. ఫోన్లలోనే అంత్యక్రియల్ని చూస్తూ మొసలికన్నీళ్లు కారుస్తున్నారు. నానాటికీ అమానవీయంగా మారిపోతున్న అంత్యక్రియల తంతుపై 'సాక్షి' ప్రత్యేక కథనం.. 10లో



150 పడకల ఆస్పత్రి పనుల పరిశీలన

- టీజీఎంఎస్‌ఐడీసీ జిల్లా ఈఈ రవీందర్‌రెడ్డి
- అందోల్ వద్ద పనుల పరిశీలన

జోగిపేట(అందోల్): అందోల్ వద్ద నిర్మించ తలపెట్టిన 150 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణాలకు సంబంధించిన పనులను టీజీఎంఎస్ఐడీసీ జిల్లా ఈఈ రవీందర్‌రెడ్డి, డీఈ విల్సన్, ఏఈ మిధున్‌లతో కలసి శనివారం పరిశీలించారు. డిసెంబర్ 5న నర్సింగ్ కళాశాల, ఆస్పత్రి పనులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేసే అవకాశం ఉందని అన్నారు. 11 ఎకరాల స్థలంలో రూ.45 కోట్లతో 150 పడకల ఆసుపత్రి, రూ.43 కోట్లతో నర్సింగ్ కళాశాలను నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని, 98వేల చదరపు అడుగుల స్థలంలో నర్సింగ్ కళాశాలతో పాటు హస్టల్‌ను కూడా నిర్మిస్తున్నామని ఈఈ తెలిపారు. కళాశాల, ఆస్పత్రుల ప్రహరీగోడల నిర్మాణాన్ని జేఎన్టీయూ కళాశాల తరహాలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో భవనాల నిర్మాణాన్ని చేపడుతున్నామని, 15 నెలల కాలంలో నిర్మించేందుకు నవతేజ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. పటాన్‌చెరువు పట్టణంలో సీఎస్ఆర్ ఫండ్స్‌తో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నామని, ఫిబ్రవరిలోగా పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.



అందోల్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఈ రవీందర్‌రెడ్డి, అధికారులు

రూ.కోటితో మార్చ్యురీ

అందోల్‌లోని 1141 సర్వేనంబరులోని స్థలంలో 150 ఆస్పత్రి వద్ద రూ.కోటితో మార్చ్యురీ నిర్మిస్తున్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. మార్చ్యురీ గదిలో స్టోరేజీ కోసం 5 ఫ్రీజర్ బాక్స్‌లు, ప్రత్యేక హాలు, వెయింటింగ్ హాలు, డాక్టర్లు డ్రెస్సింగ్ గదిని నిర్మిస్తామన్నారు. జోగిపేట ఆస్పత్రి అభివృద్ధికి మంజూరైన రూ.2.15 కోట్లలో నుంచి కోటి రూపాయలను మార్చ్యురీ గదికి కేటాయించినట్లు వెల్లడించారు.


'పంచాయతీ' పోలింగ్ కేంద్రాలపై కసరత్తు

వార్డులు, ఓటర్ల సంఖ్య ఆధారంగా

- కేంద్రాల జాబితా తయారీకి ఆదేశాలు
- మౌలిక వసతులు కల్పిస్తూ దూరాభారం తగ్గేలా..

సంగారెడ్డి జోన్: రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. అందులోభాగంగా పంచాయతీలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, జాబితాను రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఓటరు జాబితా పరిశీలనలో అధికారులు తలమునకలై ఉన్నారు. ఈ ప్రక్రియ అనంతరం పోలింగ్ కేంద్రాల పరిశీలన కార్యక్రమం చేపట్టనున్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, వాటి స్థితిగతులను పరిశీలించి జాబితాను రూపొందించి నివేదికలను పంపించనున్నారు.

జిల్లాలో 27 మండలాలు ఉన్నాయి. అందులో 646 గ్రామ పంచాయతీలు, 5718 వార్డులు ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రచురించిన తర్వాత వార్డులలోని ఓటర్ల సంఖ్య ఆధారంగా గ్రామ పంచాయతీలలో ప్రతీ వార్డుకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డిసెంబరు 6 నాటికి పోలింగ్ కేంద్రాలను సందర్శించి ముసాయిదా ఓటరు జాబితాను సిద్ధం చేయనున్నారు. కేంద్రాల ఏర్పాటు బాధ్యతను మండల పరిషత్తు అధికారులకు అప్పగించనున్నారు. 7న సిద్ధం చేసిన ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీవోలచే ప్రచురణ చేయనున్నారు. 10వ తేదిన జిల్లాస్థాయిలో జిల్లా ఎన్నికల అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష నిర్వహించనున్నారు. 12న మండల స్థాయిలో మండల అధికారులు రాజకీయ నేతలతో సమావేశం నిర్వహించనున్నారు. ముసాయిదా స్టేషన్ల జాబితాపై 7నుండి 12 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 13న స్వీకరించిన అభ్యంతరాలను పరిష్కరిస్తారు. 16న జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆమోదం చేసి, 17న మండల అధికారులు తుది జాబితాను విడుదల చేస్తారు.



పోలింగ్ కేంద్రాల సంఖ్య తగ్గే అవకాశం...

గతంలో కంటే ఈసారి పోలింగ్ కేంద్రాల సంఖ్య తగ్గే అవకాశాలున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెద్ద గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలలో విలీనం చేసింది. గ్రామ జనాభా ఆధారంగా నూతన పంచాయతీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు గతంలో 5,778 వార్డులు ఉండగా ప్రస్తుతం 5,718 వార్డులు ఉన్నాయి. ఓటర్లు 650 కంటే ఎక్కువగా ఉంటే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. వార్డులు, ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తే గతంలో కంటే 60 స్టేషన్లు తగ్గనున్నట్లు సమాచారం. పోలింగ్ కేంద్రాలు పెరుగుతాయా...తగ్గుతాయా అనేది చూడాల్సి ఉంది.

ఒకే కేంద్రంలో ఒక కుటుంబ సభ్యులు

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఒక కుటుంబానికి చెందిన సభ్యులంతా ఒకే కేంద్రంలో ఓటు వేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందుకు సంబంధించి ఓటరు జాబితాను పూర్తి చేశారు.

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే...



రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో పోలింగ్ కేంద్రాల గుర్తిస్తూ జాబితాను సిద్ధం చేయటం జరుగుతుంది. డిసెంబరు 17 వరకు తుది జాబితాను విడుదల ప్రచురిస్తాం. ఓటరుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటా.

– సాయిబాబా, జిల్లా పంచాయతి అధికారి, సంగారెడ్డి

మౌలిక వసతులు కల్పిస్తూ...

పోలింగ్ కేంద్రాలలో విద్యుత్తు, తాగునీరు, వికలాంగుల కొరకు ర్యాంపు, టాయిలెట్, బాత్రూం వంటి వసతులు కల్పిస్తూ కేంద్రాలను గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఓటు వేసేందుకు దూర భారం తగ్గించేందుకు గ్రామానికి దగ్గరగా ఉండే భవనాలను ఎంపిక చేయనున్నారు.

క్లుప్తంగా

వైజ్ఞానిక ప్రదర్శనలో మెరిసిన విద్యార్థిని



ఎంపీ రఘునందన్ రావు చేతుల మీదుగా పతకం అందుకుంటున్న సిరి

వెల్దుర్తి(తూప్రాన్): మెదక్ జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో మాసాయిపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని మెరిసింది. జిల్లా స్థాయి ప్రేరణలో 36 పాఠశాలల నుంచి విద్యార్థులు ఎగ్జిబిట్‌లు ప్రదర్శించగా అందులో మాసాయిపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని దుంపల సిరి ప్రదర్శించిన 'స్వయం చాలక నీటిపారుదల శాఖ రోబో' మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ధర్మపురి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని సిరిని, గైడ్ చేసిన ఉపాధ్యాయులు రంగారెడ్డి, ఆంజనేయులును హెచ్‌ఎంతో పాటు పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు హరి, హరిరంజన్ శర్మ, తదితరులు అభినందించారు.

సైన్స్ చెకుముకి పోటీల్లో..



విద్యార్థులను అభినందిస్తున్న సత్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ చెకుముకి పోటీల్లో ప్రైవేట్ విద్యాలయాల విభాగంలో శ్రీవాణి స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై శనివారం పాఠశాలలో ప్రముఖ విద్యావేత్త సత్యం అభినందించారు. విద్యార్థులు కావ్య, అనిరుధ్ రెడ్డి, మణిరాజ్‌లు చెకుముకి సైన్స్ పోటీల్లో మొదటి బహుమతి అందుకున్నారు. శనివారం విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో ఫైళ్ల వెతుకులాట

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కనిపించకుండా పోయిన ఫైళ్లను అధికారులు శనివారం వెతకడం మొదలు పెట్టారు. ఇటీవల మల్లన్న ఆలయంలో 2012 నుంచి 2018 వరకు కొన్ని ముఖ్యమైన ఆడిట్ అభ్యంతరాలు మాయం కావడంతో గతంలో పని చేసిన సూపరింటెండెంట్ నీల శేఖర్, జూనియర్ అసిస్టెంట్ జగన్, నర్సింహులుకు ఈవో బాలాజీ నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నోటీసులు అందుకున్న ముగ్గురు ఉద్యోగులు కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చి ఫైళ్లను వెతికినట్లు సమాచారం. ఫైళ్ల మాయం పై దేవాదాయశాఖ కమిషనర్ విచారణకు ఆదేశించారు. కానీ అధికారులు విచారణకు రాకముందే ఫైళ్లను వెతకడం కొసమెరుపు. ఈ విషయమై ఆలయ ఈవో బాలాజీని వివరణ కోరగా శనివారం ముగ్గురు ఉద్యోగులు మాయమైన ఫైళ్లను వెతికి అప్పగించినట్లు తెలిపారు.

ఆచారాలకు పాడె కట్టారు..!

మారిన అంత్యక్రియల కల్చర్

- నాడు పాడె మోసేవారు.. నేడు వైకుంఠ రథాలు
- రాత్రి వేళల్లో భజనలు, ఒగ్గు కథలు మాయం
- ఎవరైనా చనిపోతే గతంలో మనిషి వెళ్లి చెప్పేవాడు
- నేడు ఒక్క ఫోన్‌తో సమాచారం చేరవేత

అప్పట్లో ఓ వ్యక్తి చనిపోతే ప్రతి ఒక్కరూ తమ పనులు మానుకొని అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండేవారు. ఎవరూ అన్నం తినకుండా పస్తులు ఉండేవారు. గ్రామాల్లో, పట్టణాలల్లో ఉన్న బంధువులకు, స్నేహితులకు విషయం తెలియాలంటే ప్రత్యేకించి ఒక మనిషిని పంపించి సమాచారం తెలిపేవారు. ఇంటి చుట్టు పక్కల ఎవరికైనా ఫోన్ ఉంటే దాని ద్వారా తెలిపే వాళ్లు. దగ్గరి బంధువులు వచ్చే వరకు అంత్యక్రియలు చేసేవారు కాదు.

–దుబ్బాకరూరల్:







గ్రామాల్లో ఎవరైనా చనిపోతే రాత్రి వేళల్లో భజన చేసేవారు. పూర్వ కాలం పాటలు పాడుతూ అందరినీ ఏడిపించేవారు. 'చేతుల బెల్లం ఉన్నంత సేపే కాకి బలగమంటా' అనే పాట ప్రతి ఒక్కరి హృదయాలను ఆకట్టుకునేది. నాడు శవాన్ని మోసేందుకు కట్టెలతో పాడే కట్టేవారు. డప్పుచప్పుళ్లతో అంత్యక్రియలు ఘనంగా నిర్వహించేవారు. గంగిరెద్దులను ఆడించేవారు. బంధువులు, స్నేహితులు శ్మశానవాటిక వరకు శవాన్ని మోసుకెళ్లేవారు. అంత్యక్రియలు ముగిశాక గ్రామ శివారుల్లో ఉన్న చెరువుల వద్ద స్నానాలు చేసేవారు.

దశదినకర్మ

అంత్యక్రియలు పూర్తయ్యాక దశ దినకర్మ (దిన వారాలు) నిర్వహిస్తారు. మూడు రోజులకు (పిట్టకు పెట్టడం) చనిపోయిన వ్యక్తికి తనకు ఇష్టమైన వంటకాలు చేసి పెడతారు. కుటుంబీకులు, బంధువులంతా ఒక్క చోట చేరి కాష్టం చేసిన వద్ద ఆహార పదార్థాలు పెడతారు. వాటిని కాకి వచ్చి తింటుంది.

ఒగ్గు కథ

దశదినకర్మ రోజున చనిపోయిన వ్యక్తికి తీపి గుర్తుగా ఒగ్గు కళాకారులతో కథ చెప్పించే వాళ్లు. కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు, కాలనీ వాసులంతా ఒక్క చోట చేరి కథను చూసే వారు. కథ చెబుతుంటే కొంత మంది ఏడ్చేవారు. నాడు అంత్యక్రియలకు తక్కువ ఖర్చు అయ్యేది.

భజనలు, ఒగ్గు కథలు చెప్పించే వారు



నాడు ఎవ్వరైన చనిపోతే అంత్యక్రియలకు జనాలు ఎక్కువ వచ్చేవారు. అప్పుడు ఉన్న ప్రేమలు ఇప్పుడు లేవు. శవాన్ని కట్టెలతో చేసిన పాడెలో మోసుకెళ్లే వాళ్లం. నేడు వైకుంఠ రథంలో తీసుకెళ్తున్నారు. అప్పుడు ఖర్చులు తక్కువ, ఇప్పుడు ఖర్చులు ఎక్కువ. రాత్రి వేళలో భజనలు, ఒగ్గు కథలు చెప్పించే వారు. ప్రస్తుతం కనుమరుగయ్యాయి. చుట్టాలు, స్నేహితులు ఇలా వచ్చి అలా వెళ్లి పోతున్నారు. అప్పుడు చెరువుల వద్ద స్నానాలు చేసే వాళ్లంనేడు వైకుంఠధామాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

– కె.రాములు,దుబ్బాక

అక్కాచెల్లెళ్ల వంటకాయలు మాయం

మూడు రోజుల్లో ఇంటి ఆడ పడుచులు తీరొక్క వంటకాలు చేసి తమ కుటుంబీకులకు వండి పెడతారు. ఆ తర్వాత బంధువులు, స్నేహితులు ప్రతి రోజూ బాధలో ఉన్న కుటుంబీకులకు ఇష్టమైన వంటకాలు చేసి పెడతారు. దిన వారాలు పూర్తయ్యే వరకు పెడతారు. దశ దినకర్మ పూర్తయ్యే వరకు బంధువులు, స్నేహితులు చనిపోయిన వ్యక్తి కుటుంబీకులకు చేదు విడిపిస్తారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, దశదినకర్మకు తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం చేస్తున్నారు.



ఒగ్గు కళాకారులు

వాట్సాప్, ఫేస్‌బుక్‌లో ఫొటోలు,

నేటి రోజుల్లో వ్యక్తి చనిపోతే కుటుంబీకులు మాత్రమే ఉంటున్నారు. జనాలు తక్కువ సంఖ్యల్లో కనిపిస్తున్నారు. ఎవరికైనా సమాచారం చేర వేయాలంటే ఫోన్ ద్వారా వెంటనే తెలియజేస్తున్నారు. వాట్సాఫ్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్‌లో పెట్టి శ్రద్ధాంజలి చెబుతున్నారు. వారికి వీలైతేనే అంత్యక్రియలకు వస్తుండ్రు, లేకుంటే లేదు. కొంత మంది అంత్యక్రియలను వీడియో కాల్ ద్వారా వీక్షిస్తున్నారు. ప్రధాన చౌరస్తాల్లో ఫ్లెక్సీలు వేస్తున్నారు. వ్యక్తి చనిపోతే కుటుంబీకులు ఏడవడం తప్ప ఓదార్చే వారు కరువయ్యారు. రాత్రి వేళల్లో భజన చేసే లేరు. నేడు శవాన్ని వైకుంఠ రథంలో తీసుకెళ్తున్నారు. బ్యాండ్, డప్పు చప్పుళ్లతో, టపాకాయలు పేల్చుతూ ఘనంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ప్రతీ గ్రామంలో శ్మశాన వాటికలు అభివృద్ధి చెందాయి. స్నానపు గదులు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు ఉన్నాయి. మూడు రోజులకు పిట్టకు పెడితే కాకుల సంఖ్య తగ్గడం వల్ల అవి రావడం లేదు. ఆవు, కుక్కతో తినిపిస్తున్నారు. దశ దినకర్మకు ఒగ్గు కళాకారులతో కథ చెప్పించడం లేదు. డీజే బాక్సుల్లో పాటలు వేసి వింటున్నారు. బంధువులు, స్నేహితులు ఇలా వచ్చి అలా వెళ్లి పోతున్నారు.

పట్నం కల్చర్, పల్లెలకు పాకె..



నాడు గ్రామాల్లో శవాన్ని పాడె కట్టుకొని డప్పు చప్పుళ్లతో శ్మశాన వాటిక వరకు మోసుకెళ్లే వారు. నేడు గ్రామాల్లో పట్నం కల్చర్ రావడంతో వైకుంఠ రథంలో మృతదేహాన్ని మోసుకెళ్తున్నారు. బ్యాండ్, డప్పు చప్పుళ్లతో బాణా సంచలు పేల్చి ఘనంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్



విద్యార్థులతో పీడీ వెంకటస్వామి

సిద్దిపేటరూరల్: సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో జెడ్పీహెచ్‌ఎస్ చింతమడక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి శనివారం తెలిపారు. బాలుర విభాగం లాంగ్ జంప్, జావెలిన్ త్రోలో రిషి కుమార్, బాలికల విభాగం చెరుకు సాత్విక సత్తా చాటారని పేర్కొన్నారు. డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీ ల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు ఫిజికల్ డైరెక్టర్ వెంకటస్వామిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, తదితరులు అభినందించారు.

గిరిజన గురుకుల విద్యార్థులు

నర్సాపూర్ : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని స్థానిక అల్లూరి సీతరాజరాజు గిరిజన బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల మెదక్‌లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన మనోహర్, సాయిచరణ్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. నేటి నుంచి మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

దొంగతనానికి వచ్చి చిక్కాడు

- తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లగా అప్పుడే యజమాని రాక
- పట్టుకొని పోలీసులకు అప్పగింత

చిన్నశంకరంపేట(మెదక్): తాళం వేసిన ఇంట్లో దొంగతనానికి వచ్చిన వ్యక్తిని అదే సమయంలో ఇంటికొచ్చిన యజమాని పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. ఈ ఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నార్సింగి మండల కేంద్రానికి చెందిన శిర్న సంతోష్ ఇంటికి తాళం వేసి శుక్రవారం నిజామాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన అదే గ్రామానికి చెందిన కంచరి శ్రీను రాత్రి గేట్ తాళం పగులగొట్టి లోపలకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అప్పుడే ఊరి నుంచి వచ్చిన సంతోష్ దొంగను పట్టుకొని చుట్టుపక్కలవారిని నిద్రలేపాడు. వెంటను నార్సింగి పోలీస్‌లకు అప్పగించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో అద్భుత ప్రదర్శన

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైన గజ్వేల్ విద్యార్థులు



విద్యార్థి వికాస్‌తో గైడ్ టీచర్ హాఫీజ్

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో 28, 29, 30 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తాము రూపొందించిన ప్రదర్శనలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అహ్మదీపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పదవ తరగతి విద్యార్థి షేర్ల వికాస్ మ్యాట్రిస్ క్లీనింగ్ డివైజ్, ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యాని కేతన్ విద్యార్థిని జూపల్లి మనస్విని ప్యాడీ హార్వెస్టర్ అండ్ డ్రయర్ అనే ప్రాజెక్టు, పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు మనోజ్ఞ, ప్రేరణలు మ్యాథమెటిక్స్ యాంగిల్స్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్మెంట్ అంశాలపై జిల్లా స్థాయిలో అద్భుతమైన ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డిల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

పుట్టిన రోజు వేడుకలకు వెళ్లొస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి
- కొల్చారం మండలంలో ఘటన



కార్తీక్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన కోట మధు-పద్మ పెద్ద కుమారుడు కోట కార్తీక్ (24) మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యాడు. అనంతరం అదే రాత్రి బైక్ పై వస్తున్న క్రమంలో మియాపూర్ వద్ద అదుపుతప్పి ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీట్టాడు. ప్రమాదంలో కార్తీక్ తలకు తీవ్ర గాయాలు కాగా ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అదృశ్యమై.. చెరువులో శవమై

ఇంటి నుంచి వెళ్లిన యువకుడు మృతి



నవీన్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన యువకుడు చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో చోటు చేసుకుంది. శనివారం పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోతారం సుగుణ, నర్సింహులు దంపతులకు ఇద్దరు కుమారులు నవీన్ (30), రాకేశ్ ఉన్నారు. నవీన్‌కు అంగవైకల్యంతోపాటు మతిస్థిమితం లేదు. దీంతో తనకు వివాహం కావడం లేదని బాధ పడుతుండేవాడు. రెండు రోజుల కిందట బయటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం మిరుదొడ్డి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రుద్రారం శివారులోని రెడ్డి వారి కుంటలో నవీన్ మృతదేహం తేలడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బోయిని పరుశరాములు తెలిపారు.

పోక్సో కేసులో తండ్రికి రిమాండ్

కూతురితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో..

టేక్మాల్(మెదక్): కన్నకూతురితో అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రి జైలు పాలయ్యాడు. టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కూతురితో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా 22వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసి శనివారం మెదక్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. మెజిస్ట్రేట్ కేసును పరిశీలించి నిందితుడికి 14 రోజులు జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. ఈ మేరకు నిందితుడిని మెదక్ సబ్ జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

తహశీల్దార్‌కు వినతి

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రైస్తవ మతంలోకి మారిన వారికి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హిందూవాహిని ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర నాయకుడు భూంరెడ్డి మాట్లాడుతూ వెంటనే వారి రిజర్వేషన్‌లు రద్దు చేయాలన్నారు. పరశురాములు, మహేందర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజిరెడ్డి, శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

బాధితురాలికి హరీశ్‌రావు భరోసా



జ్యోతి కుటుంబానికి సాయం అందిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు సంపత్, సాయిరాం

సిద్దిపేటకమాన్: ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి ఇల్లు దగ్ధమైంది. దీంతో సామగ్రి పూర్తిగా కాలిపోయింది. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన జ్యోతి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తోంది. శనివారం ఉదయం పూజ సందర్భంగా దేవుడికి దీపం వెలిగించి ఇంటికి తాళం వేసి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. ప్రమాదవశాత్తు దీపం కింద పడి పక్కనే ఉన్న వస్తువులకు మంటలు అంటుకుని ఇల్లంతా వ్యాప్తి చెందాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. అయితే.. అప్పటికే ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు. బట్టలు, నిత్యావసర సరుకులుతో పాటు దాచుకున్న డబ్బులు మంటలకు దగ్ధమయ్యాయి. సుమారు రూ 5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమిక సమాచారం బట్టి తెలుస్తోంది. కాగా, ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంటనే పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డిని పంపించారు. తక్షణ సాయం కింద కొంత నగదు, అవసరమైన నిత్యావసర సరుకులు, బట్టలు, దుప్పట్లను పార్టీ నాయకులు ద్వారా పంపించారు. పక్కనే ఉన్న జాంబవ యూత్ భవన్‌లో తాత్కాలిక ఆశ్రమం పొందుతున్న జ్యోతి కుటుంబానికి ప్రభుత్వ సాయంతో పాటు, ఇల్లు మంజూరు చేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరాం డిమాండ్ చేశారు. వార్డు కౌన్సిలర్ సాకి ఆనంద్ తక్షణ సాయం కింద నిత్యావసర వస్తువులు అందచేశారు.

మృత్యువుతో పోరాడి ఓడింది

పెట్రోల్ దాడిలో గాయపడ్డ స్నేహలత ఆస్పత్రిలో మృతి



స్నేహలత(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): పెట్రోల్ దాడి ఘటనలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి మృత్యువుతో పోరాడి ఓడింది. హైదరాబాద్ ఓ ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామనికి చెందిన స్నేహలత(19) నవంబర్ 22న ఇంట్లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్‌తో దాడి చేశాడు. తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా ముఖం, శరీరం 50 శాతం పైగా కాలిపోయింది. ఈ ఘటనపై అదనపు ఎస్పీ సంజీవ రావు వాసర్ గ్రామాన్ని సందర్శించి నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డితో కలిసి బాధితురాలి ఇంటి వద్ద విచారణ చేశారు. ఈ క్రమంలో యువతిపై పెట్రోల్ దాడి ఎందుకు జరిగింది..? కారణాలు ఏమిటి..? ఎందుకు చేశారు.. ఎవరూ చేశారు..? అనే కోణం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంతలోనే స్నేహలత చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. స్నేహలత మృతిపై దర్యాప్తు కొనసాగిస్తున్నామని సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

రచ్చకెక్కిన బీఆర్‌ఎస్ వర్గపోరు

- ఓ వర్గానికి చెందిన ఫ్లెక్సీ చించివేత
- ఘటనపై పోలీసులకు ఫిర్యాదు



చిరిగిపోయిన ఫ్లెక్సీ

మద్దూరు(హుస్నాబాద్): నిన్నటి మొన్నటి వరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ వర్గపోరు ఒక్కసారిగా రచ్చ ఎక్కింది. వివరాల్లోకి వెళ్తే.. గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో ఉమ్మడి మండలంలో తమ పట్టును నిలుపుకోవాలని బీఆర్‌ఎస్ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలోనే శుక్రవారం దీక్షా దివస్ కార్యక్రమం కోసం మద్దూరు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్‌లోని ఓ వర్గం నేతలు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అందులో ఓ వర్గానికి చెందిన ముఖ్య నాయకుడి ఫొటో లేకపోవడంతో ధూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామానికి చెందిన అతడి అనుచరుడు ఎర్ర సాయి శుక్రవారం రాత్రి ఫ్లెక్సీని చించివేశాడు. దీనిపై ఆగ్రహించిన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దామెర మల్లేశం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి ప్రేరేపించిన మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డిపై పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తామన్నారు.

నేడు 'చలో' హైదరాబాద్

సిద్దిపేటకమాన్: ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మద్దెల నర్సింహులు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తరలి రావాలన్నారు.

పేదల కోసం పని చేయడం కాంగ్రెస్‌కే సాధ్యం

కొండపాక(గజ్వేల్): పేదల కోసం పని చేయడం కాంగ్రెస్‌కే సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకట్‌గౌడ్ అన్నారు. తిమ్మారెడ్డిపల్లిలో ప్రజా పాలన విజయోత్సవ కళాజాతలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. బ్రహ్మం, బాలకృష్ణచారి, నాగరాజు, కళాకారులు పాల్గొన్నారు.

కష్టం ఉద్యమకారులది.. ఫలితం బీఆర్‌ఎస్‌ది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉద్యమకారులు కష్టపడితే, ఫలితం బీఆర్‌ఎస్ నాయకులు పొందారని, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శనివారం సిద్దిపేట పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

భౌతికశాస్త్రంలో సుమలతకు డాక్టరేట్

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఫిజిక్స్ అధ్యాపకురాలు దొంతుల సుమలత డాక్టరేట్‌ను అందుకున్నారు. చైతన్య డీమ్డ్ టు యూనివర్సిటీ నుంచి చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్విక్‌రెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత సుమలతను అభినందించారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని రేషన్ డీలర్ల సంఘం నాయకులు శనివారం రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి విన్నవించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం, హైదరాబాద్ నాయకుడు మురళి, సంఘం రాష్ట్ర కార్యదర్శి గులాం అహ్మద్ అజీజ్, మండల ప్రధాన కార్యదర్శి చెప్యాల రాజు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రాజకీయ ఉనికి కోసమే బీఆర్‌ఎస్ యత్నాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాజకీయంగా తమ ఉనికిని కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాల వల్లనే సాధ్యమయ్యిందన్నారు. కార్యక్రమంలో శంకర్, మధు, గయాజొద్దీన్, నజ్జు, ఫయాజ్, పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీలో చోటు కల్పించాలి

బెజ్జంకి(సిద్దిపేట): పాఠశాలల మానిటరింగ్ కమిటీలో ప్రోగ్రెసివ్ పెరెంట్ కమిటీకి భాగస్వామ్యం కల్పించాలని ఆ సంఘం అధ్యక్షుడు, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పలేటి బాబు ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం అవకాశమివ్వాలని కోరారు.